తలవంచని పువ్వులు

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

౧

విక్రమ ధనంజయా! వీరనారాయణా!
జయీభవ! విజయీభవ!
విద్యాభోజా! విదర్భ రాజా!
విజయీభవ! దిగ్విజయీభవ!

వందిమాగధులు వెండిదుడ్లలో ప్రవేశించి పక్కకు తప్పుకొన్నారు. మాలవ మహారాజులుంగారు రత్నరచిత సువర్ణ సింహాసనంమీద ఆసీనులు అయినారు. మంత్రి, సామంత, దండనాథాదులూ, యావత్ప్రజానీకమూ ఆ వెనుక యథాస్థానాల్లో కూర్చున్నారు. ఇసుక వేస్తే రాలకుండా ఉన్నారు జనం.

ఏటేటా జరిగే శారదా ఉత్సవాల్లో ఆరోజు చివరిది. దేశదేశాగత నట, విట, కవి, గాయక, వైతాళికులతో ఆ నగరం తొమ్మిదిరోజులనుంచీ నిండిపోయింది. అన్నిరోజుల ఉత్సవ సారమూ ఆరోజున మూర్తికట్టి అక్కడికి చేరినట్టుంది.

సూర్యకాంత ప్రాసాదంలో ఆనాడు వినోద ప్రదర్శనం. ముందు ఆస్థాన వైణికుడు వీణమీద పట్టు బురఖాతీసి శ్రుతి సవరిస్తున్నాడు. జనం సుకుమార వీణాగానానికి ఎదురుచూస్తున్నట్టులేదు. విచ్చుకత్తుల రాజభటులు ఎర్రని చూపులతో ఎంత అదలిస్తున్నా కోలాహలం అణగటంలేదు.

దాక్షిణాత్య శిల్పి చంద్రమౌళి ఒక ప్రక్క ఒదిగి నిల్చున్నాడు. అతడెప్పుడూ రాజసభలు చూడలేదు. నాగరికుల తళుకు బెళుకులకు అతని అమాయక హృదయం అలవాటుపడలేదు. హృదయాలను సైతం కరిగించి అమృతమూర్తులుగా మలచగల అతనికి సాటి మానవులను పలకరించి ప్రసన్నులను చేసుకోవడం ఎట్లాగో తెలియలేదు. ప్రాసాదం చివర ఒక స్తంభాన్ని ఆనుకొని తెల్లబోయి చూస్తున్నాడు. నగర జనుల నిష్కారణ భంగిమలను, ఒయ్యారాలను చూచి సహజంగా ఉండవలసిన మానవులు ఎందుకిట్లా బిగువులు పోతారో అతనికి అర్థంకాలేదు.

వీణ ప్రారంభం అయింది. ఆ సిద్ధహస్తుడు అమృతవాహిని పలికిస్తున్నాడు. శ్రోతలు ఇంకెందుకో చూస్తున్నట్టుంది. మంత్రి హస్తసంజ్ఞతో వీణ ఆగిపోయింది.

ఇక ఇంద్రజాలం అన్నారు. ఒక పొట్టివాడు ముందుకువచ్చి మహారాజు ఎదుట భూమికి మూడుసారులు సమస్కరించి నిలుచున్నాడు. శుద్ధశ్రోత్రియంగావున్న ముఖంలో చంద్రవంకలా గంధపుచారలుంచి దానిమీద ఎర్రని కుంకుమబొట్టు పెట్టాడు. చేతిలోని నెమలికుంచె ఆకాశంమీద మూడుసార్లు తిప్పాడు. జలజల పువ్వులు రాలాయి. 'గగన కుసుమాలు ప్రభూ చిత్తగించండి' అన్నాడు. ప్రజలు విరగబడి నవ్వారు. నెమలిపింఛం గాలిలో సున్నాలుగా చుట్టాడు. అందులో కన్నులు మిరుమిట్లుగొలుపుతూ బలిష్ఠమైన రెండు వానరవిగ్రహాలు బయలుదేరి యుద్ధం చెయ్యడం ప్రారంభించాయి. "వాలి సుగ్రీవులు" భూలోక దేవేంద్రా!' అన్నాడు. ప్రధాని చూపుతో ఆగి, పక్కకు తొలగిపోయాడు. వీణకన్న దీనితో కొంచం ప్రజలముఖాలు కలకలలాడాయి.

ఒక మహాకాయుడు నడిచే నల్లరాతి విగ్రహంలా సభామధ్యానికి వచ్చాడు. ప్రజల్లో కలకలం బయలుదేరింది. ఉన్నచోటునుంచి ముందుకు త్రోసుకువస్తున్నారు. రాజోద్యోగులు సద్దలేక తొక్కిడిపడుతున్నారు. 'అడుగో బ్రహ్మదేశపు బలశాలి' అనేమాటలు సభలో గుప్పుమన్నాయి. అతనికి కావలసిన యేర్పాట్లన్నీ చరచర చేయించారు. మహారాజు సింహాసనంమీద సుఖస్థితిలో సర్దుకుని కళ్ళల్లో కుతూహలం కనపరచారు. మహాకాయుడు మెడలు తిరగని బింకంతో మహారాజువైపు తలవూపి సమస్కారం అభినయించాడు. ఇద్దరు భృత్యులు రెండుబాహువుల పొడవూ,

రెండంగుళాల మందమూగల ఒక ఇనుపచువ్వను తెచ్చి అతని ముందుంచారు. అతడుఅవలీలగా ఏనుగు తామర తూడును అందుకున్నట్టు దాన్నందుకుని కుడిచేతి వేళ్ళ మధ్య రెండునిమిషాలు గిరగిర తిప్పి భూమిపై నిలబెట్టాడు. జనం ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. అతడు దానిని పొట్టకు ఆనించి కండరాలు పూరించి ఇటు ఊగి అటు ఆగి కొంతసేపటికి పూర్ణానుస్వారంలా వంచి ఆ వలయాన్ని నిర్లక్ష్యంగా ఎదుటికి పడవేశాడు. ప్రజలు చప్పటవర్షం కురిపించారు. ప్రభువు ముఖంలో చిరునవ్వు వెలిగింది. ప్రధాని ఆజ్ఞతో రాజభృత్యులు వేయిదీనారాలు వెండిపళ్లెరంలోపోసి అతనికి బహూకరించారు. మహారాజులుంగారు లేచారు. అతన్ని చూడడానికి జనం విరగబడి వెంటబడారు. రాజమార్గంలో జనప్రవాహం పొంగిపోయింది. చంద్రమౌళి జనుల ఒత్తిడికి ఆగలేక తూలి ఘంటాపథంమీద పడ్డాడు. అతని పెదవిమీద, వాడి రేకులూడిన పువ్వులా చిరునవ్వుపుట్టి చెదరి అదృశ్యమయింది.

౨

సాయంకాలం చంద్రకాంత సౌధంలో మహాసభ అన్నారు. మధ్యాహ్నంనుంచి సభాభవనం అలంకరిస్తున్నారు. సభాస్థలి భూలోక స్వర్గంలా ఉంది. మాలవమహారాజువైభవానికిఅది ప్రదర్శనశాలగాబోలు. రంగురంగుల తలపాగాలతో సకల సామంతరాజులూ సభలోకి వేంచేస్తున్నారు.

చంద్రమౌళి ఒక పట్టుసంచీ చేతితో పట్టుకొని చంద్రకాంత సౌధం చలువరాతి మెట్లమీద నిలుచున్నాడు. నేటి సభలో ప్రవేశం ఎట్లాగా అని తెల్లని అమాయకపు కళ్ళతో ఆలోచిస్తున్నాడు. ఎక్కడి దక్షిణదేశం? ఎక్కడి విదర్భనగరం? రెండు దూర దూర దేశాలను రెండు దూరదూరం మానవ హృదయాలను దగ్గరగా చేర్చి స్నేహపూరితం చేసే శక్తి లోకోత్తరమైన తన శిల్పకళకు లేదా? అనుకున్నాడు.

మహాకవిగారు సపరివారంగా వస్తున్నారు. ఆయన తెల్లని బట్టతల, చుట్టూ రెల్లుపూలు పూచిన గోదావరిలంకలా ఉంది. చెవులకు బంగారు కుండలాలు, చేతులకు సింహతలాటం మురుగులు. పెద్దరకం కుంకుమ రంగు కాశ్మీరు శాలువ భుజాలను కప్పింది. వెంటవచ్చే ఆశ్రిత కవుల కైవారాలతో ఆయన హృదయం మత్తెక్కి ఉంది. ఆయన చూపునకు మరింత ఒదిగి, తన అల్పత్వం ఒప్పుకొన్న బట్టుమూర్తికి ఆ కోటలో కనకాభిషేకం కాదని తలయెత్తినవాడికి దేవిడీమన్నా. ఆ కోట బురుజులు ఆయనకోసం కట్టినవి. వాటి మధ్యకు తనకు తెలిసినంతవరకూ ఏ ప్రతిభాశాలినీ రానివ్వలేదు. తాను ఆ పరిధిదాటి ఎక్కడికీపోడు. తన పద్యాల అర్థం తానే చెప్పాలి. మహారాజే ఆనందించాలి. తక్కిన కవీశ్వరులకు మహారాజుకూ ఆయన ఆనకట్టు.

చంద్రమౌళికి సరిగా నమస్కరించడం చాతకాలేదు. అయినా చేతులు జోడించి మెట్టుమీద నిలుచున్నాడు. మహాకవిగారు నిర్లక్ష్యంగా నిలువునా చూసి 'ఎవరయ్యా నువ్వు' అన్నట్టు కళ్లను ఎగరవేశారు.

"చాలా దూర దేశంనుంచి వచ్చానండి"

"మం...చి పనిచే...శావు"

"మాలవ ప్రభువు మిక్కిలి రసజ్ఞులనీ, కళాసౌందర్యవేత్తలనీ మా వైపు గొప్పవాడుక"

"ఎవరు కాదన్నారు?"

"ఆ రసిక ప్రభువు దర్శనం చేస్తేనే నా కళ చరితార్థం; అనే నమ్మకంతో ఎన్ని కష్టాలైనా లెక్క చెయ్యకుండా వచ్చాను."

"అబ్బా!"

"కళాజీవి బాధా, రసజ్ఞ సందర్శనం కోసం పడే తహతహా మహా కవీంద్రులు తమకు తెలియనిది కాదు."

ఈ చివరిమాటతో కవిగారి వికారం కొంత ఉపశమించినా ఆయన అహంకారానికి తగిన ఆహారం పడలేదు.

"ఇంతకీ...ఏమంటావు?"

"నా కళను ప్రభువులవద్ద ప్రదర్శించే అవకాశం కలిగించ వలసిందని కోరుతున్నాను."

"మధ్యను... నేనెవణ్ణి? నువ్వేమో మహాకళావేత్తవు. అయనేమో మహా రసజ్ఞులాయె! ఆలస్యం ఎందుకు. ప్రభువులు సభకు వేంచేసే వేళ అయింది. వెళ్ళి దర్శనం చెయ్యి."

"ఒక దేశాంతర ఆగంతకుడికి ఈ మాత్రం సహాయము చెయ్యలేరా? మీ ప్రభువు కళాప్రియత్వానికి ఈమాత్రం వన్నె పెట్టలేరా?"

"ఈ మధ్య కొత్తమాటలు నేర్చారు. చిన్నప్పటి నుంచీ వేల పద్యాలురాసి పోశాను. మహాకవి అనిపించు

కున్నాను. అంతేగాని — ఈ కళ యేమిటి? కళాయి యేమిటి?...కవిత్వం ఏమైనా చేసి తెచ్చావా?"

"లేదండి."

"అయితే...ఈ ఉపన్యాసమంతా ఏమిటి? మాకు చాలా తొందరపని ఉంది. ఇప్పుడు కవుల సభ. నువ్వేమో కవివి కావు. ఇంక నీ కళ ఏమిటి?"

"మనవి చేస్తున్నాను. కవిత్వం అంటే నాకు తెలియదు. నేనేమీ మాటాడలేను. కాని నేను తెచ్చిన అపూర్వ వస్తువు పలుకుతుంది. మాటాడుతుంది. రసజ్ఞుల మనస్సును లాలించగలదు. ఒక్క త్రుటి...ప్రభువు ఎదుట నిలుపగలిగితే..."

"అబ్బో!...ఏదీ ఆ వస్తువు?"

"క్షమించండి. ప్రభు సమక్షంలో తప్ప పైకి తియ్యను. అది నా కళామర్యాద. ఆయన కానుకను ఆయనే తొలిసారి చూడాలని నా కాంక్ష. ఈ ప్రభు గౌరవాన్ని మీరు కూడా ఆమోదిస్తారనే నమ్ముతున్నాను."

మహాకవిగారి కళ్ళల్లో మంటలు రేగాయి. కుండలాలు ఊగాయి. తన ప్రాముఖ్యానికే తీరని అవమానం జరిగింది. ఇంతవరకూ తన అనుగ్రహం కోసం చేతులు జోడించుకు తిరిగేవాడేగాని ఎదిరించి మాటాడిన వాడు లేకపోయాడు. శిల్పివైపు చురచుర చూసి జారే కాశ్మీరు శాలువాను మరింత ఎర్రగా పైకి తోసి చరచర పరివారంతో నడిచి వెళ్ళిపోయారు. చంద్రమౌళి తన తప్పేమో తెలియక తెల్లబోయాడు. కర్తవ్యం ఏమిటి??

లోపల సభ ప్రారంభమయింది. మహాకవిగారి శుష్క సమాసాలు సాగిసాగి వినిపిస్తున్నాయి. ఇటునుంచి చదివితే రాజు పేరు అటునుంచి చదివితే తన పేరూ ఇందులో ఉందని ఒత్తి ఒత్తి చెబుతున్నారు. చంద్రమౌళి ఇంత దూరం వచ్చి రాజ దర్శనం చెయ్యకుండా వెళ్ళకూడ దనుకున్నాడు. చర్రున సభలోకి దూసుకువెళ్లాడు. సభాస్థలి చేరకుండా రాజభటు లడ్డగించారు.

"ప్రభుదర్శనం చెయ్యాలి"

"అనుజ్ఞ ఉండి తీరాలి"

"ఇది మా ప్రభువారికి కానుక. పాదపీఠం దగ్గర ఉంచివస్తాను. వెళ్ళ నివ్వండి."

"అడుగు కదిలితే... మెడ మీద తల ఉండదు"

"మీ ప్రభువు సరసతా, మీ యోగ్యతా ఇంతటి వేనా?"

ఒక రాజభటుడు చటుక్కున వచ్చి ఆ మహాశిల్పి మెడమీద చెయ్యి వేసి ఒక్క ఊపున గెంటి వేశాడు. అతడు చలువరాతి మెట్లమీదనుంచి దొర్లి నేలమీద పడ్డాడు. చేతిలో నిపటుసంచీ దూరంగా పడ్డది. చంద్రమౌళి నెమ్మదిగా లేచి సంచీ తీసుకుని నీరునిండిన కళ్ళతో ఒక్కసారి రాజభవనంకేసి చూసి చరచర కోట వెలుపలికి నడిచాడు. రాజవీధి నిర్మానుష్యంగా ఉంది. తన లోకోత్తర శిల్పాన్ని పైకి తీసి తనివితీరా చూసుకున్నాడు. దాని వెనక ఉన్న కథ అతని తడికళ్ళల్లో తిరిగింది.

3

ఒకనాడు తన పల్లెటి కుటీరంలో చంద్రమౌళి ఉలిని ఒక మంచిగంధపుముక్క మీద నడుపుతున్నాడు. అతని తియ్యని ఊహలు సున్నితమైన ఉలి మీదకు జారి చందన ఖండంలో సుందరరేఖలుగా విడుతున్నాయి. శిల్ప సౌందర్యమో, చందన హృదయమో ఆ రేఖల్లో పరిమళాలు నింపుతున్నాయి.

సుందరేశ్వరుని ముందు కృశాంగి హైమవతి. ఆయన కళ్ళల్లో ప్రేమభిక్ష. ఆ కులపాలిక అరమోడ్పు కన్నుల్లో చిక్కని సిగ్గులు. అతని మనస్సుకంటె వేగంగా ఉలిపరిగెత్తుతున్నది. ఉలికంటె వేగంగా ఊహలు తరుముకున్నాయి. ఆ శిల్పంలో కలిసిపోయి తానున్నట్టే మరచిపోయాడు ఆ కళా తపస్వి.

తన కుటీరం వాకిట్లో ఏదో అలజడి. అయినా అతను తలయెత్తి లేదు. కర్రగుండెలోనుంచి కళను ఇంకా పిండుతూనే ఉన్నాడు.

భార్య 'ఆశ' అలజడిగా వచ్చి ఎదుట నుంచుంది. ఐదేళ్ళబిడ్డ కళ వెక్కి వెక్కి యేడుస్తూ ఉండగా చంద్రమౌళి తలయెత్తి చూచాడు.

తనబిడ్డకంటెనుంచి జారే నీలాలు చూచిన అతని చేతిలోని ఉలి జారిపోయింది.

తపోభంగంలా శిల్పం ఆగిపోయింది. 'ఏమిటె సంగతి' అన్నాడు విధిలేక —

ఆశ ఎర్రబడ్డముఖంలో చెప్పడం మొదలు పెట్టింది — "పాపం, 'కళ' యేమీ చెయ్యలేదు

సుమండీ—మన పొగడచెట్లక్రింద పువ్వులేరుకుంటూ ఆడుకుంటున్నది. ఆ ధనవంతుల బిడ్డలేదూ శేషమణి. ఆ పిల్ల, కళను పిలిచి తీసుకువెళ్ళింది. ఇద్దరూ చాలాసేపు ఆడుకున్నారు. ఆ పిల్ల మెడలోని రత్నాలహారం దీని మెడలో వేసి 'నీకిచ్చేశాను తీసుకో' అందిట. కళ నిజమనుకుని ఇంటికి పరుగెత్తుకువస్తూఉంటే ఆ అమ్మాయి ఏడుస్తూ కళ హారం ఎత్తుకు పోతున్నదని తల్లితో చెప్పిందిట. వెంటనే ఆవిడ పరుగెత్తుకువచ్చి 'దొంగబుద్ధులు, దొంగపిల్లలు లేకివాళ్ళతో స్నేహాలు వద్దంటే మా పిల్ల వినదు' అని ఈ పిల్లను గుంజి హారం తీసుకుని వెళ్ళిపోయింది "ఇదేనా మర్యాద చూడండి. కూటికి పేదలమైతే గుణానికీనా?" అని ఆమె బరువుగా నిట్టూర్చింది, చురచురమనే కళ్లతో—

చంద్రమౌళి అన్నాడు నెమ్మదిగా—

"పిచ్చిదానా నీకూ ఉంది ధనవంతులంటే వ్యామోహం. వారి తళతళలాడే నగలూ, మిలమిలలాడే చీరలూ చూచి ఎంత ఆకర్షణ నీకు! వారిలాగే మెరిసి పోవాలని ఎంత ఆరాటపడతావు! ఆ కోరిక ఎప్పుడో మనల్ని శాపమై మొత్తుతుంది. ఈసడిస్తుంది. అని నీకు తెలియలేదు. ఇంక ఊరుకో—" అని మళ్లా శిల్పాన్ని అందుకున్నాడు.

ఆశ ఊరుకోలేదు.

ఆపండి ఆ పని. ఆలుబిడ్డలు సుఖించని ఈ చెక్కడాలు శిల్పాలూ ఎందుకూ? చేతులో ఇంత నేర్పుండి ఏం లాభం? తలుచుకుంటే అట్లాంటి రత్నహారాలు పది సంపాదించగలరు. నన్నూ బిడ్డనూ అలరించి అలంకరించగలరు. కళను చూచి మెచ్చి ఇచ్చే ప్రభువులు దేశంలో లేకపోలేదు. వచ్చేవి శారదోత్సవాలు. మీ చెయ్యిసోకితే రాళ్ళుమాటాడతాయి. ఒక్క శిల్పంతో ఆ మాళవరాజును సంతోషపెట్టలేరా?

కాంక్షతో తీవ్రంగా వెలిగే ఆశ కళ్ళకు అతను లొంగిపోయాడు.

ఆనాడే దీక్ష వహించాడు. ప్రశస్తమైన ఏనుగు దంతం సంపాదించాడు. చంద్రవంకలా ఉన్న ఆ దంతఖండాన్ని నిలువునా పూలదండగా మార్చివెయ్యాలనుకున్నాడు. ఉలి అమోఘంగా పనిచెయ్యడం ప్రారంభించింది.

ప్రతీరాత్రీ ఆశ ఎదురుగా కూర్చునేది. ఆమె కళ్ళ అందం అతని శిల్పానికి దీపం అయింది. ఆమె ఎర్రని పెదవుల చిరునవ్వు అతని కల్పనకు జీవంపోసింది. ఆమె ఒక్కొక్క సుందర భంగిమ అతని చేతిని పరుగులెత్తించింది. ముప్పది రోజులు అహోరాత్రాలు పని చేశాడు.

ముక్కలు చెయ్యలేదు. అతుకు లేదు. ఏనుగు దంతం హఠాత్తుగా మల్లెపూలదండగా మారిపోయింది. రేకు రేకునా సహజమైన ముడుతలు. ముడత ముడతలో అచ్చమైన నొక్కుల సొగసులు. కొన్ని పూర్తిగా విడిన మల్లెలు. కొన్ని అరవిచ్చినవి. చివర ఒక బొడ్డు మల్లె కొలికి పూస.

ఒక్కొక్క పువ్వుకూ ఒక్కొక్క నెత్తురుబొట్టు ఖర్చుపెట్టాడు.

చిక్కిపోయిన చెక్కిళ్ళతో తృప్తిగా నవ్వి అతనిగుండె పూచిన పూలమాలను ఆశఎదుట సగర్వంగా ఎత్తి పట్టుకున్నాడు. ఆశ కళ్ళల్లో ఆనందజలం చిమ్మింది. ఒక ముహూర్తాన ప్రభు సందర్శనంకోసం మూటకట్టుకు బయలుదేరాడు.

౪

చంద్రమౌళి రాజవీధిలో వేడిగా నిట్టూర్చి తన శిల్పంవైపు ఇంకొకసారి చూశాడు. ఆ తెల్లని పువ్వులు తనని చూసి పకపక నవ్వినట్లనిపించింది. ప్రతి పువ్వూ తనకోసం దీనంగా ఎదురుచూసే ఆశ ముఖం జ్ఞాపకం చేసింది. అమాయకపు కళ్ళలో నీరు కార్చే తన బిడ్డ కళ పరుగెత్తుకొనివచ్చి కాళ్లి చుట్టవేసుకున్నట్టనిపించింది.

పొంగివచ్చే కన్నీళ్లను ఆపుకుని నగరం వెలుపలి శూన్యంలోకి నడచి ఒక రావిచెట్టుకింద నిలుచున్నాడు. అమోఘమైన తన శిల్పాన్ని ఊచిపుచ్చుకుని చెట్టు మొదటికి విసిరి వేశాడు. అది పోయి ఒక రాతికి తగిలిన చప్పుడయింది.

నివ్వెరపోయి చెట్టు మొదట పరిశీలించాడు. ఆశ్వయుజమాసపు వెన్నెల వెలుగుల్లో స్పష్టంగా కనబడుతున్నది.

ఆ పుష్పమాల ధ్యానముద్రలో ఉన్న బుద్ధదేవుని పాదాలముందు పడింది.

అతనికి నవ్వు వచ్చింది.

"సింహాసనంమీది శిలావిగ్రహానికి సమర్పించదలచిన అపూర్వ పుష్పమాల ఈ జీవనిరామూర్తి పాదాలను పూజించిందా? ఎంత ధన్యుణ్ణి!"

చంద్రమౌళి నిమీలిత నయనాలతో బుద్ధదేవుని పాదాలముందు నిలువునా మోకరిల్లాడు.

ఒక శీతల హస్తం అతని వెన్నుపై నిమిరినట్లయింది!